బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 12 జూన్ 2025 | www.balagamtv.com | పేజీలు 4

## ప్రభాకర్ రావుకు మరోసారి నోటీసులు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ ఎస్ఐబి చీఫ్ ప్రభాకర్ రావును సిట్ అధికారులు విచారించారు. ఈ విచారణ దాదాపు 9 గంటల పాటు కొనసాగింది. విచారణ సందర్భంగా ఆయన నుంచి రెండు మొబైల్ ఫోన్లను సిట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఈసారి విచారణ ముగిసినప్పటికీ కేసులో ఇంకా కీలక అంశాలపై స్పష్టత అవసరమైన నేపథ్యంలో ఈ నెల 14వ తేదీన మరోసారి హాజరు కావాలంటూ అధికారులు ప్రభాకర్ రావుకు నోటీసులు జారీ చేశారు. తద్వారా ఆయన మరోసారి సిట్ ముందు హాజరుకానున్నారు.

# నాణ్యతకు ప్రాధాన్యమిచ్చాం



- నీటి నిల్వ ఇంజినీర్లకే తెలుసు
- కాళేశ్వరం న్యాయ కమిషన్ ఎదుట మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్
- 50 నిమిషాలు..18 ప్రశ్నలు
- ఇన్ కెమెరాలో విచారణ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం కమిషన్ విచారణ ముగిసింది. దాదాపు 50 నిమిషాల పాటు విచారణ సాగింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి కేసీఆర్‌ను కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్ ప్రశ్నించారు. బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 12:50 నిమిషా ల వరకు ప్రశ్నలను సంధించింది. విచారణ కమిషన్ చైర్మెన్ పీసీ ఘోష్‌తోపాటు కార్యదర్శి మురళీధర్, కేసీఆర్ ముగ్గురే ఉన్నారు. ఇందులో అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియా ఎవరికీ అనుమతించలేదు. తొలుత ఓపెన్ హాల్‌లో విచారణ చేయాలని కమిషన్ చైర్మెన్ భావించినా 'తన ఆరోగ్యం బాగాలేదనీ, జలుబుతో స్వల్ప అనారోగ్యానికి గురయ్యానని, వన్ టూ వన్ అయితే తాను స్పష్టంగా సమాధానాలు చెప్పగలనని' కేసీఆర్ చేసిన విజ్ఞప్తికి కమిషన్ చైర్మెన్ పీసీ ఘోష్ అనుమతించారు. దీంతో ముగ్గురు మాత్రమే ఓపెన్ హాల్‌లో ఉన్నారు.

మీడియాతో పాటు ఇతరులను ఓపెన్ హాల్ నుంచి బయటకు పంపారు. సుమారు 50 నిమిషాల పాటు సాగిన విచారణలో కేసీఆర్‌ను పదుల సంఖ్యలో కమిషన్ ప్రశ్నలు వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు తొలి నుంచి చివరి దాకా జరిగిన ప్రక్రియపై సమాచారం రాబట్టినట్టు తెలిసింది. 115వ సాక్షిగా హాజరైన కేసీఆర్ నుంచి అఫిడవిట్ సైతం తీసుకున్నారు.

ఈ సందర్భంగా కమిషన్‌కు కేసీఆర్ పలు డాక్యుమెంట్లను అందించారు. మొదట దైవసాక్షిగా వాస్తవాలు చెబుతానని కేసీఆర్ చేత ప్రమాణం చేయించిన కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్. మొత్తం 18 ప్రశ్నలను ఘోష్ అడిగారు. రీ ఇంజనీరింగ్, కార్పొరేషన్ ఏర్పాటు, కేబినెట్ ఆమోదంపై కమిషన్ ప్రశ్నలు వేసింది. రీ ఇంజనీరింగ్ చేయడానికి ప్రధాన కారణాలను కేసీఆర్ సుదీర్ఘంగా వివరించారు. ప్రతిదీ కేబినెట్ ఆమోదంతో జరిగిందని కేసీఆర్ వివరణ ఇచ్చారు. కేబినెట్ ఆమోదంతోనే ప్రభుత్వం అన్ని నిర్ణయాలు తీసుకుందన్నారు. స్థల మార్పు నీటి లభ్యత, కాళేశ్వరం నిర్మాణంపై వ్యాప్కోస్ నివేదిక ఇచ్చిందని కమిషన్‌కు చెప్పారు. లైఫ్ లైన్ కాళేశ్వరం పుస్తకాన్ని కమిషన్‌కు అందజేశారు. అందులో కాళేశ్వరం ఉద్దేశ్యాలను వివరించారు. నిధుల సమీకరణ కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేశామని.. బ్యారేజీల్లో నీటి నిలువ అనేది ఇంజనీర్లు తీసుకునే నిర్ణయం తనకు సంబంధం లేదని కేసీఆర్ వెల్లడించారు.బ్యారేజీల్లో నీటి నిల్వ కోసం మీరేమైనా ఆదేశాలు ఇచ్చారా అని కమిషన్ ప్రశ్నించగా తాను అలాంటి ఆదేశాలు ఇవ్వలేదని.. బ్యారేజీలు నీటిని ఎత్తిపోయడానికి నిర్మించినవి అని కేసీఆర్ సమాధానమిచ్చారు. ప్రాజెక్ట్ లొకేషన్ మార్పు నిర్ణయం ఎవరిది అంటూ కమిషన్ మరో ప్రశ్న సంధించింది. లొకేషన్ ఎందుకు మార్చాల్సి వచ్చిందో కేసీఆర్ సుదీర్ఘంగా వివరించారు. సీడబ్ల్యూసీ తుమ్మిడి హట్టి వద్ద నీటి లభ్యత లేదని చెప్పిందని.. వ్యాప్కోస్ సర్వే చేసి నివేదిక ఇచ్చిందన్నారు. టెక్నికల్ టీం మూడు బ్యారేజీలు నిర్మించాలని చెప్పిందన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి మహారాష్ట్ర అంగీకరించలేదని చెప్పారు. టెక్నికల్ టీం ఇచ్చిన నివేదిక మేరకు లోకేషన్ మార్పు జరిగిందన్నారు. నిర్ణయాలన్నీ కేబినెట్ ఆమోదంతోనే జరిగాయని కేసీఆర్ చెప్పారు. నాణ్యతకు అత్యంత ప్రాధాన్యమిచ్చాన్నారు కేసీఆర్.. చివరగా కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించిన పుస్తకాన్ని కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్‌కు కేసీఆర్ అందజేశారు.

# కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ స్థాయిలో అక్రమాలు

- రెండు, మూడు రోజుల్లో అన్ని సంబంధిత పత్రాలను ప్రజల ముందుకు తీసుకువస్తా
- 'న్యాయ కమిషన్' ముందు చెప్తా
- కేసీఆర్ ఫ్యామిలీవి 'అసెంబ్లీ రౌడీ' సినిమాలోని పాత్రలు
- రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన ప్రతి ప్రాజెక్ట్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారు
- మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ స్థాయిలో అక్రమాలు జరిగాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వచ్చే రెండు, మూడు రోజుల్లోపుగా అన్ని సంబంధిత పత్రాలను ప్రజల ముందుకు తీసుకువస్తానని ఆయన ప్రకటించారు. 'న్యాయ కమిషన్' ముందు చెప్తా అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన ప్రతి ప్రాజెక్ట్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ ఏం చెబుతారో, కిషన్‌రెడ్డి అదే అమలు చేస్తున్నారని అన్నారు. కిషన్ రెడ్డి, కేసీఆర్‌ను వేరేలా చూడలేమని తెలిపారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డిని కలిసినట్టు చెప్పారు. కానీ... తెలంగాణ నుంచి క్యాబినెట్ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి ఏనాడైనా రాష్ట్ర అభివృద్ధి అంశాలపై రివ్యూ చేపట్టారా? అని ప్రశ్నించారు. ఆయన రాష్ట్ర ప్రాజెక్టలను ప్రతిపాది ంచకపోవడం వల్లే ఏ ప్రాజెక్ట్ రావడం లేదన్నారు. క్యాబినెట్ కన్నా ముందు కనీసం ప్రధాని మోడీ దగ్గరైనా తెలంగాణ అంశాలను లేవనెత్తారా? అని అడిగారు. మూడు రోజుల ఢిల్లీ పర్యటన ముగింపునకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి తుగ్లక్‌రోడ్‌లోని తన అధికారిక నివాసంలో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు.

కే. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) మరియు అతని కుటుంబాన్ని "తెలంగాణకు శత్రువులు"గా ఆయన వ్యాఖ్యానించారు. బీజేపీ నేత, కేంద్ర మంత్రి జీ. కిషన్‌రెడ్డిపై రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నారని తీవ్రంగా విమర్శించారు.కేసీఆర్ కూతురు కవిత చేసిన వ్యాఖ్యలు కేవలం ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు చేసిన డ్రామానేనని రేవంత్ విమర్శించారు. "వాళ్లు అసెంబ్లీ రౌడీ సినిమా పాత్రల లాగా మీడియా స్టంట్లు వేస్తున్నారు," అని ఆయన అన్నారు. బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్‌లో స్థానం లేదని స్పష్టం చేసిన రేవంత్, కేసీఆర్ కుటుంబ సభ్యులకు తెలంగాణ రాజకీయాల్లో ఇక ప్రాధాన్యం లేదని తేల్చిచెప్పారు. కిషన్ రెడ్డి రెండుసార్లు కేంద్ర మంత్రిగా ఉన్నా రాష్ట్రానికి ఒక్క మెట్రో ప్రాజెక్టు, లేక ఇతర కేంద్ర నిధులు తీసుకురాలేదని ఆరోపించారు. "తమిళనాడు, కర్ణాటకకు మెట్రో ప్రాజెక్టులు రావటానికి నిర్మలా సీతారామన్, ప్రహ్లాద్ జోషి కృషి చేస్తే, కిషన్ రెడ్డి మాత్రం హైదరాబాద్ మెట్రో విస్తరణకు అడ్డుపడ్డారు," అని వ్యాఖ్యానించారు. అయినా తెలంగాణ అభివృద్ధికి నిజంగా కిషన్ రెడ్డి ప్రయత్నిస్తే, తాను కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని రేవంత్ తెలిపారు. తాను నడిపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం కోసం కట్టుబడి ఉందని చెబుతూ, ఇటీవల జరిగిన క్యాబినెట్ విస్తరణలో 55 శాతం మంత్రులు వెనుకబడిన వర్గాలవారేనని గుర్తు చేశారు.

తాను ప్రధానిని కలిస్తే తప్పు పడుతోన్న కిషన్‌రెడ్డి... తెలంగాణకు సంబంధించిన ఎనిమిది మంది బీజేపీ ఎంపీలతో రాష్ట్ర ప్రాజెక్టలపై కిషన్ రెడ్డి ఎందుకు ప్రధానిని కలిసి కోరడం లేదన్నారు. కిషన్ రెడ్డి రివ్యూ చేస్తా అంటే... తెలంగాణ అధికారులందరినీ తీసుకొని ఢిల్లీ వస్తానని సవాల్ విసిరారు. గతంలో ప్రధాని మోడీ తనకు ఇచ్చిన పెండింగ్ ప్రాజెక్ట్ లపై రివ్యూ చేసి అన్నింటినీ పరిష్కరించినట్టు తెలిపారు. ఇందులో బీబీనగర్ ఎయిమ్స్ విషయంలో చాలా వేగంగా స్పందించారని కేంద్ర మంత్రి గడ్కరీ స్వయంగా తనకు ఫోన్ చేసి మెచ్చుకున్నారని చెప్పారు. కులగణన కోసం ఎవరూ తన ఇంటికి రాలేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను సీఎం తోసిపుచ్చారు. డోర్ టూ డోర్, టోల్ ఫ్రీ, ఆన్‌లైన్, ఇతర పద్ధతుల్లో ప్రజలకు ఎన్‌రోల్ చేసుకునే అవకాశం కల్పించామన్నారు. సర్వే ద్వారా ఫైనల్‌గా 97 శాతం రికార్డ్స్ సేకరించామన్నారు. కేసీఆర్,

మిగితా 2వ పేజీలో

## కేసీఆర్‌ను విచారణకు పిలిచారంటే..
# హనుమంతుడి ముందు కుప్పిగంతులే

- ఇరిగేషన్ మీద కేసీఆర్‌కు ఉన్న అవగాహన ఎవరికీ ఉండదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

కేసీఆర్ అంటే ఒక చరిత్ర.. ఇరిగేషన్ విషయంలో కేసీఆర్‌ను విచారణకు పిలిచారంటే.. హనుమంతుడి ముందు కుప్పిగంతులు లాంటిది. ఇరిగేషన్ మీద కేసీఆర్‌కు ఉన్న అవగాహన బహుషా ఈ దేశంలోని సమకాలీన రాజకీయ నాయకులలో ఎవరికి ఉండదు. చివరకు ధర్మం, న్యాయమే గెలుస్తది. తెలంగాణను సాధించిన నాయకుడిగా, సస్యశ్యామలం చేసిన నాయకుడిగా కేసీఆర్ పేరు చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడుతది' అని కేటీఆర్ అన్నారు. బీఆర్కే భవన్ వద్ద కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

రేవంత్ రెడ్డి కూలగొట్టడానికి వచ్చాడు తప్ప కట్టడానికి రాలేదు. విధ్వంసకరమైన ఆలోచనలతో పేదల ఇండ్లు కూలగొట్టడం, ప్రాజెక్టులను కూలగొట్టడం.. రాజకీయ వేధింపులు, కక్ష సాధింపులు తప్ప ఈ సన్నాసికి ఏం చేతకాదు అని అర్థమైతుంది. 100 జన్మలు ఎత్తినా రేవంత్ రెడ్డి అనే చిల్లర గాడికి కేసీఆర్ గొప్పతనం అర్థం కాదు. రేవంత్ రెడ్డి గురువు, ఆయన జేజమ్మతో గొడవ పడి ఇక్కడ నుండి తరిమిన వాడే కేసీఆర్. రేవంత్ రెడ్డి అనే చిల్లరగాడు ఏం చేసినా, ఆయన ప్రభుత్వం ఏం చేసినా కేసీఆర్ వెంట్రుక కూడా పీకలేడు. రేవంత్ రెడ్డిని వదిలిపెట్టం.. కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టేదాకా వెంటాడుతాం అని కేటీఆర్ తేల్చిచెప్పారు.ఈ చిల్లర రాజకీయాలను పట్టించుకోవద్దని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా. ఆరు గ్యారెంటీలు, 420 హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉండాలి. రేవంత్ రెడ్డిని ప్రజాక్షేత్రంలో బట్టలిప్పి నిలబెట్టే రోజులు వస్తాయి. రేవంత్ రెడ్డి లాంటి చిల్లర నాయకుడికి కేబినెట్ అంటే అర్థం కాదు.. కేబినెట్ ఎట్ల పని చేస్తదో తెలియదు. రైతుల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలు ముఖ్యం ఆయనకు. విచారణల పేరిట రేవంత్ రాక్షసానందం పొందుతున్నారు. నిజం నిలకడగా తెలుతుంది. కొన్ని రోజులు కాళేశ్వరం అని, ఫోన్ ట్యాపింగ్ అని, ఈ ఫార్ములా అని డ్రామాలు ఆడుతున్నారు. మంత్రి వర్గ విస్తరణ చేయలేని సీఎం.. చివరకు శాఖలు కేటాయించుకోలేని అసమర్థ సీఎం రేవంత్ రెడ్డి అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

# 'ములుగు'కు మరో వెయ్యి ఇండ్లు మంజూరు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- ములుగు జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు జారీ



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఇందిరమ్మ రాజ్యమంటే రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించి ఇవ్వడమే లక్ష్యమని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అర్హులందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి దనసరి సీతక్క అన్నారు. బుధవారం ములుగు జిల్లా ఇంచర్ల గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో 23మంది లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేయడమే కాకుండా ఇండ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సభలో మంత్రులు మాట్లాడారు. గత పాలకులు చేసిన అప్పులను తీర్చుకుంటూనే తల తాకట్టు పెట్టయినా సంక్షేమ ఫలాలను అమలు చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. ములుగు నియోజకవర్గానికి 3వేల ఇండ్లు మంజూరు కాగా ఐటీడీఏకు మరో 1500 ఇండ్లు మంజూరయ్యాయని, తాను మరో వెయ్యి ఇండ్లను మంజూరు చేస్తున్నామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్దిదారులకు వెంటనే ఉచితంగా ఇసుక కోసం కూపన్లను అందజేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అటవీశాఖ అధికారులు సైతం ఇండ్ల నిర్మాణ పనులను అడ్డుకోవద్దని అన్నారు. రానున్న రోజుల్లో జరగనున్న ఎన్నికల్లో ప్రజలు తమకు అండగా ఉండాలని కోరారు. జిల్లాను పూర్తిస్థాయిలో

మిగితా 2వ పేజీలో

# రెండు రైల్వే ప్రాజెక్ట్‌లకు ఆమోదం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ప్రధాని మోడీ అధ్యక్షతన బుధవారం జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ రూ.6,405 కోట్ల విలువైన రెండు ప్రాజెక్టలను ఆమోదించింది. ప్రయాణ సౌలభ్యాన్ని మెరుగుపరచడం, లాజిస్టిక్స్ వ్యయాన్ని, చమురు దిగుమతులను, కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గించడమే లక్ష్యంగా ఈ కీలక నిర్ణయం తీసుకుంది. జార్ఖండ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని ఏడు జిల్లాలను కవర్ చేసే రెండు రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. వీటి మొత్తం వ్యయం రూ.6,405 కోట్లు.

133 కి.మీ పొడవైన కోడెర్మా-బర్కకానా ట్రాక్‌ను డబ్లింగ్ చేయడం ప్రాజెక్టులలో ఒకటి, ఇది జార్ఖండ్‌లోని ప్రధాన బొగ్గు ఉత్పత్తి ప్రాంతం గుండా వెళ్లడమే కాకుండా పాట్నా మరియు రాంచీ మధ్య అతి తక్కువ మరియు మరింత సమర్థవంతమైన రైలు లింక్‌గా కూడా పనిచేస్తుంది. రెండవ రైల్వే ప్రాజెక్ట్ కర్ణాటకలోని బళ్లారి మరియు చిత్రదుర్గ జిల్లాలు మరియు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాల గుండా వెళ్ళే 185 కి.మీ బళ్లారి-చిక్జాజూర్ ట్రాక్‌ను డబ్లింగ్ చేయడం. జార్ఖండ్, కర్ణాటక మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని ఏడు జిల్లాలను కవర్ చేసే ఈ రెండు ప్రాజెక్టులు భారతీయ రైల్వేల ప్రస్తుత నెట్‌వర్క్‌ను దాదాపు 318 కిలోమీటర్లు పెంచుతాయి. ఆమోదించబడిన మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్ట్ దాదాపు 28.19 లక్షల జనాభా కలిగిన సుమారు 1,408 గ్రామాలకు కనెక్టివిటీని పెంచుతుందని ప్రభుత్వం తెలిపింది. బొగ్గు, ఇనుప ఖనిజం, తుది ఉక్కు, సిమెంట్, ఎరువులు, వ్యవసాయ వస్తువులు మరియు పెట్రోలియం ఉత్పత్తులు వంటి వస్తువుల రవాణాకు ఇవి ముఖ్యమైన మార్గాలు. సామర్థ్యాన్ని పెంచే పనుల ఫలితంగా 49 MTPA (సంవత్సరానికి మిలియన్ టన్నులు) పరిమాణంలో అదనపు సరుకు రవాణా జరుగుతుంది.

భారతీయ రైల్వేలు పర్యావరణ అనుకూలమైనవి మరియు ఇంధన సామర్థ్యం గల రవాణా విధానం, వాతావరణ లక్ష్యాలను సాధించడంలో మరియు దేశం యొక్క లాజిస్టిక్స్ వ్యయాన్ని తగ్గించడంలో, చమురు దిగుమతిని (52 కోట్ల లీటర్లు) తగ్గించడంలో మరియు 11 కోట్ల చెట్లను నాటడానికి సమానమైన సీఓ2 ఉద్గారాలను (264 కోట్ల కిలోలు) తగ్గించడంలో సహాయపడతాయి.

**1,408 గ్రామాలకు కనెక్టివిటీ మెరుగుపడుతుంది.**

కేంద్రం ప్రకారం, ఆమోదించబడిన మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్ట్ దాదాపు 28.19 లక్షల జనాభా కలిగిన సుమారు 1,408 గ్రామాలకు కనెక్టివిటీని పెంచుతుంది. పెరిగిన లైన్ సామర్థ్యం చలనశీలతను గణనీయంగా పెంచుతుంది, ఫలితంగా భారతీయ రైల్వేలకు మెరుగైన కార్యాచరణ సామర్థ్యం మరియు సేవా విశ్వసనీయత పెరుగుతుంది. ఈ మల్టీ-ట్రాకింగ్ ప్రతిపాదనలు కార్యకలాపాలను క్రమబద్ధీకరించడానికి మరియు రద్దీని తగ్గించడానికి సిద్ధంగా ఉన్నాయని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

## కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు

- అడ్లూరికి సంక్షేమం, వివేక్‌కు కార్మిక, మైనింగ్
- వాకాటికి క్రీడలు, పశుసంవర్ధక శాఖలు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన ముగ్గురు కొత్త మంత్రులకు శాఖలు కేటాయిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. గడ్డం వివేక్: కార్మిక, మైనింగ్, అడ్లూరి లక్ష్మణ్ : ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖలు, వాకిటి శ్రీహరి: క్రీడలు, యువజన సర్వీసులు, పశు సంవర్ధకశాఖలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. తాజా విస్తరణతో క్యాబినెట్ మంత్రుల సంఖ్య 15కి చేరింది. పాతమంత్రుల శాఖల్లో మార్పులు చేయకుండా సీఎం వద్ద ఉన్న శాఖలనే కొత్త మంత్రులకు కేటాయించారు. ఈ నెల 8న ముగ్గురు కొత్త మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించిన విషయం తెలిసిందే.

## టెట్ హాల్‌టికెట్లు విడుదల

**18 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో రాతపరీక్షలు**

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీటెట్) రాతపరీక్షలు ఈనెల 18 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో జరుగుతాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, టెట్ చైర్‌పర్సన్ ఈవి నరసింహారెడ్డి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టెట్‌కు దరఖాస్తు చేసిన అభ్యర్థుల హాల్ టికెట్లు విడుదలయ్యాయని తెలిపారు. అభ్యర్థులు జర్నల్ నెంబర్, పుట్టిన తేదీని ఎంటర్ చేసి వెంటనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. టెట్ రాతపరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా పేపర్-1కు 63,261 మంది, పేపర్-2కు 1,20,392 మంది కలిపి మొత్తం 1,83,653 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు.

## జూలై 1 నుంచి ఆధార్‌తోనే తత్కాల్ టికెట్లు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో




జూలై 1 నుంచి ఆధార్ అథంటికేషన్ కలిగిన యూజర్లు మాత్రమే తత్కాల్ టికెట్లు బుకింగ్ చేసుకునేలా రైల్వే మంత్రిత్వశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. తత్కాల్ టికెట్ల ప్రయోజనాల్ని నిజమైన వినియోగదారులకు మాత్రమే అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేసింది. "2025 జూలై 1 నుంచి ఆధార్ అథంటికేషన్ కలిగిన యూజర్లు మాత్రమే తత్కాల్? టికెట్లు బుకింగ్ చేసుకోగలుగుతారు. ఇందుకోసం వారు ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ వెబ్‌సైట్/యాప్‌లను ఉపయోగించుకోవచ్చు" అని రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది.2025 జూలై 15 నుంచి తత్కాల్ టికెట్ల బుకింగ్ కోసం ఆధార్ ఆధారిత ఓటీపీ అథంటికేషన్ కూడా తప్పనిసరి అని రైల్వే మంత్రిత్వశాఖ పేర్కొంది.

తత్కాల్ బుకింగ్ విండో ఓపెన్ అయిన మొదటి 30 నిమిషాల వరకు రైల్వే అధీకృత ఏజెంట్లు తత్కాల్ టికెట్లు బుకింగ్ చేయకుండా రైల్వే మంత్రిత్వ శాఖ పరిమితి విధించింది. ముఖ్యంగా ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు ఎయిర్ కండిషన్డ్ తరగతులకు, ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు నాన్ ఎయిర్ కండిషన్డ్ తరగతులకు ఏజెంట్లు తత్కాల్ టికెట్లు బుకింగ్ చేయకుండా ఆంక్షలు విధించింది.ఈ కొత్త వ్యవస్థకు అవసరమైన మార్పులు చేయాలని, ఈ మార్పులను అన్ని జోనల్ రైల్వేలకు తెలియజేయాలని రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ సెంటర్ , IRCTCలను రైల్వే మంత్రిత్వ శాఖ ఆదేశించింది. అంతేకాదు ఈ నూతన మార్పుల గురించి సాధారణ ప్రజలకు తెలియజేసేందుకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాల ద్వారా విస్తృతంగా ప్రచారంచేయాలని సర్క్యులర్‌లో పేర్కొంది

# పరిశ్రమల ఏర్పాటును బీఆర్ఎస్ అడ్డుకుంటోంది

- మంత్రి శ్రీధర్‌బాబు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో పరిశ్రమలు ఏర్పాటు కాకుండా బీఆర్ఎస్ కుట్రలు చేస్తోందని పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపించారు. యువతకు ఉపాధి అవకాశాలు దొరక్కుండా చేయాలన్నదే వారి దుర్మార్గపు ఆలోచన అని మండిపడ్డారు. "ఏడాదిన్నరలో రాష్ట్రానికి రూ.3లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ప్రైవేటు రంగంలో లక్షన్నర ఉద్యోగాలు కల్పించాం. పరోక్షంగా మరో లక్ష మంది ప్రయోజనం పొందుతున్నారు. పెట్టుబడులన్నీ కార్యరూపం దాలిస్తే తమకు రాజకీయ భవిష్యత్తు ఉండదని భారాస కలవరపడుతోంది. పరిశ్రమల ఏర్పాటుకు ఆటంకాలు సృష్టిస్తూ భారాస నేతలు రైతులను రెచ్చగొడుతున్నారు. అరాచకం సృష్టించాలని చూస్తే ప్రభుత్వ యంత్రాంగం చూస్తూ ఊరుకోదు. 2025-26 నాటికి పెట్రోల్‌లో 20శాతం ఇథనాల్ కలపాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. జోగులాంబ గద్వాల్ జిల్లా పెద్ద ధన్వాడలో కేంద్రం నిర్ణయం మేరకే ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటవుతోంది. భూములను పరిశ్రమ యాజమాన్యమే కొనుగోలు చేసింది. నిర్మాణం పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభమైతే యువతకు ఉద్యోగాలు వచ్చి ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. భారాస మాత్రం రాజకీయ ఎజెండాతో ఫ్యాక్టరీ ఏర్పాటును అడ్డుకుంటోంది. గత ఓటమి నుంచి భారాస గుణపాఠం నేర్చుకుని రాష్ట్రాభివృద్ధికి సహకరించాలి" అని శ్రీధర్‌బాబు అన్నారు.

## యూపీఐ లావాదేవీలపై మర్చెంట్ చార్జీల వార్తల్లో నిజం లేదు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

త్వరలోనే యూపీఐ లావాదేవీలపై మర్చెంట్ ఛార్జీల ను విధించాలని కేంద్రం యోచిస్తున్నట్లు వస్తున్న వార్తలపై కేంద్రం స్పందించింది. సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారం, వార్తలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఖండించింది. ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని.. తప్పుడు వార్తలు, నిరాధారమైనవని, తప్పుదారి పట్టించేవి అని పేర్కొంది. మర్చంట్ టర్నోవర్ కంటే ట్రాన్సాక్షన్ విలువ ఆధారంగానే ఛార్జీలను వసూలు చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది. రూ.3 వేల కంటే ఎక్కువ ఉన్న అన్ని యూపీఐ చెల్లింపులపై ఛార్జీలను విధించే అవకాశం ఉందని.. చిన్న మొత్తాలపై ఎలాంటి ఫీజులు ఉండవని వార్తలు వచ్చాయి. అయితే, దీనిపై ఆర్థిక మంత్రిత్వశాఖ స్పందిస్తూ ఎండీఆర్ వసూలు చేయబడుతుందనేది ఊహాగానాలు మాత్రమేనని.. ఇందు లో ఎలాంటి నిజం లేదని తెలిపింది. ఇలాంటి నిరాధారమైన వార్తలు పౌరుల్లో అనవసరమైన అనిశ్చితి, భయం, అనుమానాలను కలిగిస్తాయని.. యూపీఐ ద్వారా చెల్లింపులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రిత్వశాఖ సోషల్ మీడియా వేదికగా పేర్కొంది.

## చైనాతో అమెరికా ఒప్పందం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

అమెరికా, చైనా దేశాల మధ్య వాణిజ్య సంబంధాలలో ఒక కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇరు దేశాల మధ్య ఒక అద్భుతమైన వాణిజ్య ఒప్పందం కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఈ ఒప్పందంలో భాగంగా, ఆటోమోటివ్, రక్షణ రంగాలకు అత్యంత కీలకమైన అరుదైన ఖనిజాలను అమెరికాకు ఎగుమతి చేయడానికి చైనా అంగీకరించిందని ఆయన తెలిపారు.దీనికి ప్రతిగా, అమెరికాలోని కాలేజీలు, యూనివర్సిటీలలో చదువుకోవాలనుకునే చైనా విద్యార్థులకు వీసాలు జారీ చేయడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం వేదిక 'ట్రూత్ సోషల్'లో తెలిపారు.

# తెలంగాణలో ఐదురోజులు భారీ వర్షాలు..



బలగం టీవి, హైదరాబాద్

తెలంగాణలో ఐదురోజుల భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులు, గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. బుధవారం వికారాబాద్, కామారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వానలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. పలుచోట్ల ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది.

గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, జగిత్యాల, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని చెప్పింది. శుక్రవారం నిర్మల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడుతాయని చెప్పింది. ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. అలాగే, శని, ఆదివారాల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పింది.

# కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ స్థాయిలో అక్రమాలు

(మొదటి పేజీ తరువాయి)

కిషన్‌రెడ్డి, హరీశ్‌రావు, కేటీఆర్, ఇతర గ్రేటర్ పరిధిలోని ముఖ్యనేతల వివరాలను హైదరాబాద్ కలెక్టర్ నేరుగా వెళ్లి నమోదు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. కానీ...వీరందరూ రాజకీయంగా కులగణన సర్వేకు దూరంగా ఉన్నారని విమర్శిం చారు. నిజంగా కిషన్‌రెడ్డి ఎన్‌రోల్ చేసుకోవాలనుకుంటే... కనీసం టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసినా సరిపోయేదన్నారు. డేటా ప్రైవసీ యాక్ట్ ప్రకారం... ఈ సర్వే డేటాను భద్రంగా ఉంచినట్టు చెప్పారు. కర్నాటకలో తెలంగాణ కులగణన మోడల్ అమలు కోసం ఢిల్లీ వచ్చినట్టు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. తన దగ్గర ప్రస్తుతం 12 శాఖలు ఉన్నాయని, హైదరాబాద్‌కు వెళ్లగానే మిగితా మంత్రుల దగ్గర ఉన్న శాఖలపై రివ్యూ నిర్వహిస్తానని తెలిపారు. మొదట తన దగ్గర ఉన్న శాఖలను కొత్త వారికి ఇవ్వాలని యోచిస్తున్నట్టు చెప్పారు.

రికమెండేషన్ల ప్రకారం క్యాబినెట్ విస్తరణ చేపట్టలేదని... కులసర్వే డేటా ఆధారంగానే ప్రస్తుతం తెలంగాణ మంత్రి వర్గ విస్తరణ చేసినట్టు సీఎం చెప్పారు. కేసీఆర్ ఆరు నెలలు ఒక్క మంత్రిని నియమించకపోయినా ఎవరూ ప్రశ్నించలేదన్నారు. కానీ...తాము చరిత్రలో తొలిసారి ఎస్సీ, బీసీ వర్గాలకు సామాజిక న్యాయం అందించేలా మంత్రి వర్గ విస్తరణ చేపట్టామని తెలిపారు. మిగిలిన మూడు బెర్త్‌లను సమయానుగుణంగా భర్తీ చేస్తామని చెప్పారు. అయితే మొత్తం 18 మంది మంత్రి వర్గంలో... కేసీఆర్ ఎనిమిది మంది రెడ్డిలు, నలుగురు వెలమ, ఒక ఖమ్మ సామాజిక వర్గానికి చెందిన వారికి పదవులు కట్టబెట్టారన్నారు. కానీ దాదాపు 40 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు ఒక్కో పదవి ఇచ్చారని విమర్శించారు. తాము మాత్రం సామాజిక న్యాయంలో భాగంగా.. ఒక స్పీకర్, నలుగురు మంత్రులు మొత్తం ఐదుగురు ఎస్సీ వర్గానికి చెందిన వారికి అవకాశం కల్పించామని తెలిపారు. అంటే 18 శాతం ఉన్న ఈ వర్గానికి... మంత్రి వర్గంలో 26 శాతం ప్రయార్టీ ఇచ్చామని తెలిపారు.

తమది రేర్ (ఆర్‌ఏ ఆర్‌ఈ) కాంబినేషన్ అని సీఎం రేవంత్ చెప్పారు. రేర్ అంటే రాహుల్– రేవంత్ అని అభివర్ణించారు. ఢిల్లీ పర్యటనలో అగ్రనేతలు రాహుల్, ఖర్గేలతో పార్టీ అంతర్గత అంశాలపై చర్చించినట్టు తెలిపారు. 'పార్టీ అపాయింట్ చేస్తేనే ప్రభుత్వం అవుతుంది. మాది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, రేవంత్ రెడ్డి నేతత్వంలో కొనసాగుతోన్న సర్కార్. అలాంటప్పుడు రాష్ట్ర ఇన్‌చార్జి, పీసీసీ చీఫ్, డిప్యూటీ సీఎంలు లేకుండా క్యాబినెట్‌పై ఎలా చర్చిస్తాం. ఇదంతా విపక్షాలు ఆడుతోన్న మైండ్ గేమ్' అని విమర్శించారు. ఆ విపక్షాల మాయలో పడొద్దని ప్రజలకు సూచించారు. కర్ణాటకలో అమలు చేయాల్సిన కుల గణనకు... తెలంగాణ సక్సెస్ మోడల్‌ను ఎలా వాడుకోవాలనే దానిపై అధిష్టానం పెద్దలతో చర్చ జరిగిందన్నారు. తెలంగాణ కుల గణన మోడల్‌ను యాజ్ టీజ్‌గా కర్ణాటకలో ఇప్లిమెంట్ చేయాలని హైకమాండ్ ఆలోచిస్తోందన్నారు. అందులో భాగంగా ఆ రాష్ట్ర సీఎం సిద్ధ రామయ్య, తనను పిలిచి... కులగణనపై వివరించాలని అధిష్టానం సమావేశం నిర్వహించిందన్నారు. తెలంగాణ సర్కార్ చేపట్టిన సర్వేలో కులం అనేది ఒక అంశం మాత్రమే కాదని... 360 డిగ్రీల్లో సోషల్, ఎడ్యూకేషన్, ఎంప్లాయిమెంట్, కుల, రాజకీయ అంశాల వారీగా చేసిన సర్వేగా అభివర్ణించారు. దీని ద్వారా వార్డ్ మెంబర్ నుంచి పార్లమెంట్ వరకు ఏయే పదవులకు ఏ కులం, ఏ పార్టీ... రిజర్వేషన్, జనరల్ కోటాలో ఎన్నిసార్లు అవకాశం పొందిందో వ్యక్తిగత డేటాను క్రోడికరించినట్టు తెలిపారు.

### కాంగ్రెస్‌లోకి కేసీఆర్ ఫ్యామిలీకి నో ఎంట్రీ...

రేవంత్ రెడ్డి ఉన్నంత వరకు కాంగ్రెస్ పార్టీలో కేసీఆర్ కుటుంబానికి చోటు లేదని అన్నారు. తెలంగాణకు కేసీఆర్, ఆయన కుటుంబం దుష్మన్ అని అన్నారు. ఈ దుష్మన్ పరివార్‌కు కాంగ్రెస్ పార్టీలో జాగా లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంగా మారిందని బీజేపీ అగ్రనేతలు మోడీ, అమిత్ షా ఆరోపించారని గుర్తు చేశారు. ఇదే నిజమైతే బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కాళేశ్వరం ప్రాజెక్ట్ అద్భుతం అని ఎలా చెప్తారని ప్రశ్నించారు. ఈటల రాజేందర్ కామెంట్స్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి కూడా సమర్థించారన్నారు. ప్రజల్లో బీఆర్ఎస్, కల్వకుంట్ల ఫ్యామిలీపై చర్చ లేనప్పుడు... అందరి అటెన్షన్ పొందేందుకు ఆ కుటుంబం సెల్ఫ్ క్రియేషన్ చేస్తోందని సీఎం విమర్శించారు. 'అసెంబ్లీ రౌడీ' సినిమాలో దొంగతనం చేసేందుకు వీలుగా ఉండే భాషా క్యారెక్టర్‌లా... కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీశ్‌రావులు పాత్రలు పోషిస్తున్నారన్నారు. అమాయకుడిని టార్గెట్ చేసి తమలో తాము కొట్టుకుంటున్నట్టు భాషా క్యారెక్టర్‌తో పలువురు ఉంటారన్నారు. అలాగే బీఆర్ఎస్‌లో ఈ ఫ్యామిలీ సైతం తమలో తాము గొడవ పెట్టుకొని... పొద్దుగాల చర్చకు తెరలేపిందని విమర్శించారు. ఫైనల్‌గా అందరూ కలిసి కాళేశ్వరం కమిషనర్ దగ్గరకు పోయి ఆందోళన చేస్తోన్నారని ఎద్దేవా చేశారు. అంటే ఇంత కాలం కేసీఆర్ చుట్టూ దయ్యాలు ఉన్నాయన్న కవిత... మరి ప్రస్తుతం తాను కూడా దయ్యం అయ్యారా? అనేది చెప్పాలన్నారు. తాను ముందు నుంచి కేసీఆర్ ఫ్యామిలీనే కొరివి దెయ్యాలని చెబుతున్నట్లు గుర్తు చేశారు. 18 నెలల్లో బీఆర్ఎస్‌పై ఎప్పుడూ తాము కక్షపూరిత రాజకీయాలు చేయలేదన్నారు. అవినీతి ఆరోపణలపై కమిషన్లు వేశామని, ఆ కమిషన్లు తమ పని తాము చేసుకుంటున్నాయని చెప్పారు. కాళేశ్వరంపై సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి ఘోష్‌తో కమిషన్ వేశామని వివరించారు.

కేసీఆర్‌తో పాటు అందరూ కాళేశ్వరం కమిషన్ ముందు తమ అభిప్రాయాలను తెలిపార న్నారు. అయితే తనకు తెలంగాణ నాలుగున్నర కోట్ల ప్రజలే కమిషన్ అని, ఆ కమిషన్ ముందు తన అభిప్రాయాలను వివరిస్తానన్నారు. ఈ దిశలో కాళేశ్వరానికి ంబంధించి నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ, జ్యూడీషియల్ కమిషన్, విజిలెన్స్ కమిషన్, ఇతర రిపోర్ట్‌లపై రెండు రోజుల్లో ప్రెస్‌మీట్‌తో ప్రజల ముందుకు వస్తానన్నారు. 'నక్సల్ బరి ఖతం అయ్యే ప్రసక్తే లేదు. నక్సలిజం అనేది ఒక ఫిలాసఫీ, లా అండ్ ఆర్డర్ సమస్య కాదు. ఇది పూర్తిగా సోషల్ ఇష్యూ. ఎప్పటి వరకు ప్రజల్లో సోషల్ ఇంట్రెస్ట్ ఉంటుందో, అప్పటి వరకు ఇది వివిధ రూపాల్లో నిక్షిప్తమై ఉంటుంది.' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

# 'ములుగు'కు మరో వెయ్యి ఇండ్లు మంజూరు

(మొదటి పేజీ తరువాయి)

పర్యాటక ప్రాంతంగా మార్చడానికి నిధులు కేటాయించినట్టు చెప్పారు. రూ.70కోట్లతో రామప్పలో పనులు చేపట్టడమే కాకుండా రూ.30 కోట్లతో ఐలాండ్ అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు. ప్రతి మహిళ.. మహిళా సంఘాల్లో చేరి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని పొంది పలు రకాల వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఇక్కడి ప్రాంతంలోని మహిళలకు ఇతర ప్రాంతాల్లో ఎంతో ప్రాచుర్యం పొందిన బొంగు చికెన్‌పై శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. ములుగు జిల్లాలోని టేకులగూడెం అనే చిన్న ప్రాంతంలో కూడా స్వయంగా మంత్రుల ద్వారా ఇందిరమ్మ గృహాల శంకుస్థాపన జరగడం ప్రజల్లో ప్రభుత్వం పట్ల ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని అన్నారు. ఏజెన్సీ ప్రజలను దృష్టిలో ఉంచుకొని కేవలం 140 గృహాలు ఉన్న చిన్న గ్రామానికి కూడా ప్రత్యేక వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసి నీరు అందించిన ఘనత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికే దక్కుతుందన్నారు.



# బాత్‌రూంలో జారిపడిన ఎమ్మెల్యే పల్లా

- ఎడమ కాలి తొడ ఎముక ఫ్రాక్చర్
- యశోద ఆస్పత్రిలో సర్జరీ

బలగం టీవి, హైదరాబాద్

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బుధవారం బాత్‌రూంలో జారిపడడంతోఎడమ కాలి తొడ ఎముక ఫ్రాక్చర్ కాగా, కుటుంబ సభ్యులు హుటాహుటిన సోమాజిగూడ యశోద దవాఖానకు తరలించారు. వైద్యులు వివిధ పరీక్షలు నిర్వహించి, శస్త్రచికిత్స నిర్వహించాల్సి ఉంటుందని చెప్పారు. వెంటనే సర్జరీ చేశారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణ ముగిసిన అనంతరం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా పల్లాకు ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. అలాగే దవాఖానలో అందుతున్న వైద్యం గురించి అడిగారు. అనంతరం వైద్యులతో మాట్లాడి, పల్లాకు చేసిన శస్త్ర చికిత్స వివరాలను ఆరా తీశారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని, రోజువారీ కార్యకలాపాలలో యథాతథంగా నిమగ్నం కావాలని ఆకాంక్షించారు. కేసీఆర్ వెంట మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్‌కుమార్, సంతోష్‌కుమార్, మాలోతు కవిత, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, కందాల ఉపేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేశ్‌రెడ్డి పార్టీ ముఖ్య నేతలు ఉన్నారు. అంతకుముందు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కూడా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని పరామర్శించారు. కేసీఆర్ సతీమణి కల్వకుంట్ల శోభ.. పల్లాను ఫోన్‌లో పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మాజీ ఎంపీలు నామా నాగేశ్వరరావు, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి తదితరులు కూడా దవాఖానకు వెళ్లి పల్లాను పరామర్శించి ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# చెత్త తరలించే ట్రాక్టర్లలో డీజిల్ పోయించలేని స్థితికి రేవంత్ సర్కార్

- హరీష్ రావు

బలగం టీవి, హైదరాబాద్

రాష్ట్రంలో చెత్త తరలించే ట్రాక్టర్లలో డీజిల్ పోయించలేని దిక్కుమాలిన స్థితికి సిఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని దిగజార్చారని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్‌రావు విమర్శించారు. పెట్రోల్ పంపు వాళ్ళు డీజిల్ ఉద్దెరకు పోయడం లేదని, అప్పు పుడుతలేదని, సెక్రటరీలు ట్రాక్టర్ తాళాలను అధికారులకు అప్పగించే పరిస్థితికి తెచ్చారని మండిపడ్డారు. ఏడాదిన్నరగా నిధులు ఇవ్వకుంటే గ్రామ పాలన ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి చేతగానితనం పంచాయతీ అధికారులకు, పారిశుధ్య సిబ్బందికి శాపంగా మారుతున్నదని అన్నారు. కెసిఆర్ గ్రామ పంచాయతీలను దేశం గర్వించే దిశగా తీర్చిదిద్దితే, రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం వల్ల పంచాయతీలు కునారిల్లుతున్నాయని పేర్కొన్నారు. పంచాయతీల సంఖ్యను 12,941కి చేర్చి, ప్రతి గ్రామపంచాయతీకి ట్రాక్టర్, ట్రాలీ ఉన్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణను కెసిఆర్ నిలిపారని తెలిపారు. నిధులు లేక గ్రామాల్లో పారిశుధ్యం కుంటుపడిందని, నెల నెలా నిధులు విడుదల చేయకుండా నిర్వహణను గాలికి వదిలి వేయడంతో గ్రామాలు మురికి కూపాలుగా మారాయని ఆరోపించారు. చివరకు ట్రాక్టర్లలో డీజిల్ పోయడానికి కూడా డబ్బులు లేని పరిస్థితి నెలకొందని, కొన్ని చోట్ల అధికారులు మూలకు పెట్టగా, మరికొన్ని చోట్ల వారం, మూడు రోజులకు ఒకసారి నడుపుతున్నారని, అంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు అని పేర్కొన్నారు. సొంత జేబు నుంచి డబ్బులు ఖర్చు చెయ్యలేక, ఆ ఆర్థిక భారాన్ని మోయలేక పంచాయతీ కార్యార్శులు మూకుమ్మడిగా సెలవులు పెట్టే దుస్థితి దాపురించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలన గాలికి వదిలేసి ముగ్గురు మంత్రులకు పోర్టు ఫోలియోలు కేటాయించేందుకు మూడురోజులుగా సిఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో తీష్ట వేశారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి వెంటనే నిధులు విడుదల చేయాలని, పాడై పోతున్న గ్రామ పంచాయతీ వ్యవస్థను తిరిగి గాడిన పెట్టాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నా సినిమాలకు టికెట్ ధరలు పెంచను : దిల్‌రాజు

బలగం టీవి, హైదరాబాద్

తాను నిర్మించే సినిమాలకు ఇకపై టికెట్ ధరలు పెంచేది లేదని ప్రముఖ నిర్మాత దిల్ రాజు స్పష్టం చేశారు. ప్రేక్షకులను తిరిగి థియేటర్లకు రప్పించే విషయంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన కొన్ని సూచనలు తన నిర్ణయానికి ప్రేరణ అని దిల్ రాజు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, "ప్రేక్షకులను థియేటర్లకు మళ్ళీ తీసుకురావడానికి పవన్ కల్యాణ్ కొన్ని విలువైన సూచనలు చేశారు. వాటిని నేను తప్పకుండా పాటిస్తాను" అని చెప్పారు. సినీ పరిశ్రమ బాగు కోసం పవన్ కల్యాణ్ ఇచ్చిన సలహాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా, తోటి నిర్మాతలు కూడా పవన్ కల్యాణ్ చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని, వాటిని ఆచరణలో పెట్టాలని దిల్ రాజు విజ్ఞప్తి చేశారు. అందరూ కలిసికట్టుగా నిర్ణయాలు తీసుకుంటేనే పరిశ్రమకు మేలు జరుగుతుందని, ప్రేక్షకులు కూడా థియేటర్లకు రావడానికి ఆసక్తి చూపుతారని ఆయన అన్నారు. సినీ రంగంలో ప్రస్తుతం ఒక సానుకూల మార్పు అవసరమని, దానికి తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని దిల్ రాజు భరోసా ఇచ్చారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ప్రభుత్వ విప్..

**బలగం టీవీ, వేములవాడ**

ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం కింద మంజూరైన చెక్కులను మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. వేములవాడ అర్బన్, రూరల్ మండలాలకు చెందిన 72 మంది అర్హులైన లబ్ధిదారులకు రూ. 24 లక్షల 31 వేల విలువైన చెక్కులను ఆయన అందజేశారు.

## బోయినిపల్లిలో బడిబాట

**బలగం టీవీ, బోయినిపల్లి**




రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మల్కాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పిల్లల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా యువజన సంఘాల అధ్యక్షులు అమీర్ శెట్టి భూమిరెడ్డి, మాజీ విద్యా కమిటీ చైర్మన్ మరియు ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి ఉపాధ్యాయులు రాములు, తిరుపతి రెడ్డి, అంగన్వాడి టీచర్ కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.



## వృద్ధాశ్రమంలో యోగాపై అవగాహన

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21) సందర్భంగా దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా, తంగళ్ళపల్లి మండలంలోని మండపెల్లి గ్రామ వృద్ధాశ్రమంలో ప్రత్యేక యోగా కార్యక్రమం జరిగింది. వృద్ధాశ్రమంలో ఉన్న సీనియర్ సిటిజన్‌లకు ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలంటే యోగా అత్యవసరమని తెలియజేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఆయుష్ యునాని డిస్పెన్సరీ యోగా శిక్షకులు బి. శ్రీనివాస్, టి. స్వప్నలు సీనియర్ సిటిజన్‌లతో ఆసనాలు, ప్రాణాయామం, ముద్రలు మరియు ధ్యానం చేయించారు. వాటి ఉపయోగాలు, ఫలితాలను వారికి వివరంగా వివరించారు. ఈ కార్యక్రమానికి రాజన్న సిరిసిల్ల జిల్లా తిరుపతి, స్థానిక మండపెల్లి గ్రామం ఆశ వర్కర్లు మరియు సీనియర్ సిటిజన్‌లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు

**జిల్లా విద్యాధికారి కె రాము**

**బలగం టీవీ, జగిత్యాల:**



ధర్మపురి మండలం కమలాపూర్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులతో జిల్లా విద్యాధికారి కె రాము ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తూ ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని కోరారు కార్యక్రమం లో భాగం గా పాఠశాల ఉపాధ్యాయుడు నూనావత్ రాజేష్ తన ముగ్గురు పిల్లలు అనిరుధ్, అన్విత,అక్షర లను కమలాపూర్ ప్రభుత్వ పాఠశాల లో చేర్పించారు ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి రాము మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో సంపూర్ణ మూర్తిమత్వం అభివృద్ధి జరుగుతుందని మరియు అర్హత కలిగిన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని ఉచితంగాపాఠ్యపుస్తకాలతోపాటు రెండు జతల యూనిఫామ్స్, నోట్ బుక్స్ ఇవ్వడం జరుగుతుందనిఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. మండల విద్యాధికారి సీతా లక్ష్మీ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు మ్యాన పవన్ కుమార్, ఆసిఫ్, రాజేష్, ప్రీతి, సంపూర్ణ, వేంకటవ్వ గ్రామ పెద్దలు వెల్మల సతీష్, కుమ్మరి తిరుపతి, కుమ్మరి రవి, ఒడ్డేటి భూమయ్య, ఒడ్డేటి నరేష్, సత్తంశెట్టి అనిల్, కుమ్మరి రాజన్న, ఆకుల ప్రసాద్, సి ఆర్ పి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# 'నాణ్యమైన విద్యా హామీ ఇస్తున్నాం..'

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**




తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్టీఎఫ్) రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ 'బడిబాట' ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ప్రజలకు భరోసా కల్పించడం ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశ్యం. టీఆర్టీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బోయన్నగారి నారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీకి రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్య, ఏఐ ఆధారిత విద్య, డిజిటల్ విద్యను అందిస్తోందని తెలిపారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని, తరగతి గది సామర్థ్యాన్ని విద్యా హామీగా ఇస్తున్నామని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉన్నారని, అనేక సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తున్నందున వాటిని ఉపయోగించుకోవాలని కోరారు. ఒత్తిడి లేని విద్య, పౌష్టికాహారం ప్రభుత్వ పాఠశాలలతోనే సాకారం అని పేర్కొన్నారు.

ప్రభుత్వ విద్యను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం, ప్రభుత్వ బడులను బలోపేతం చేయడం, సమాజానికి దగ్గర చేయడం, పాఠశాలల్లోని వివిధ కార్యక్రమాల్లో సమాజాన్ని అనుసంధానం చేయడం వంటి లక్ష్యాలతో రాష్ట్రవ్యాప్తంగా ఈ 'బడిబాట' విద్య ఉద్యమాన్ని కొనసాగిస్తామని టీఆర్టీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. జిల్లా పరిషత్ బాయ్స్ హై స్కూల్ నుండి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ కొత్త బస్టాండ్, తెలంగాణ తల్లి విగ్రహం, నేతన్న విగ్రహం, అంబేద్కర్ విగ్రహం మీదుగా గాంధీ చౌరస్తా వరకు సాగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్, రాష్ట్ర మెంబర్షిప్ కన్వీనర్ సుంకిశీల ప్రభాకర్ రావు, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బోయన్నగారి నారాయణ, ప్రధానోపాధ్యాయుల సంఘ అధ్యక్షులు మోతిలాల్, టీఆర్టీఎఫ్ నాయకులు పోతుగంటి రమేష్, మహేషుని లక్ష్మీనారాయణ, గోలీ రాధాకిషన్, ముత్తయ్య గారి నాగరాజు, జిల్లెల్ల శ్రీనివాస్ గౌడ్, ఇప్పకాయల ప్రకాష్, రాజశేఖర్, దేవేందర్, పప్పుల శ్రీనివాస్, సామల రాములు, కుమారస్వామి, పులి ప్రవీణ్ కుమార్, కోల వినయ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు బాలఎల్లయ్య, కొమురయ్య, సుల్తాన్ రాజు, బూట్ల శ్రీనివాస్, జె. శ్రీనివాస్ రావు, మామిడాల రమేష్ తదితరులు 50 బైక్‌లతో ర్యాలీలో పాల్గొన్నారు.

## బ్రాహ్మణ వసతి గృహ నిర్మాణానికి భూమిపూజ..



**బలగం టీవీ, వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ పట్టణంలో, శంకర మఠం వెనుక భాగంలో వేములవాడ అనువంశిక అర్చక ట్రస్ట్ మరియు బ్రాహ్మణ నిత్యాన్న సత్రం ఆధ్వర్యంలో "అభినవ విద్యా తీర్థ సదనము" నిర్మాణానికి భూమి పూజ జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజన్న క్షేత్రంలో సామాజిక సేవలో బ్రాహ్మణుల కోసం ఒక వసతి గృహం ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమని అన్నారు. బ్రాహ్మణ వసతి గృహ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ. 10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించడం కోసం అనేక మంది వివిధ కులాల వారీగా సత్రాలు నిర్మాణం చేసుకుంటున్నారని ఆయన గుర్తుచేశారు. రాజన్న ఆలయ అభివృద్ధిలో తనకంటూ సొంత ఎజెండా ఏమీ లేదని, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు.



## ముదిరాజ్ కమిటీ మండల అధ్యక్షులుగా పండుగ రమేష్

**-మండల అధ్యక్షులుగా పండుగ రమేష్, ప్రధాన కార్యదర్శిగా రెడ్డవేణి రాజు.**

**బలగం టీవీ, బోయినిపల్లి**


ముదిరాజ్ కమిటీని బుధవారం రోజున ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా పండుగ రమేష్, ప్రధాన కార్యదర్శిగా రెడ్డవేణి రాజు. ఉపాధ్యక్షులుగా బరిగే రమేష్, బత్తిని శేఖర్, దండవేని రాజనర్సు, జంగిటి మధు, కార్యదర్శులుగా తిప్పరవేని కనకరాజు. నెల్లి దేవయ్య, తునికి మల్లేశం, కోశాధికారిగా పిట్టల రమేష్, కార్యవర్గ సభ్యులుగా జెట్టి ఐలయ్య, బొజ్జ రాజయ్య, దండు చంద్రయ్య, తిప్పరవేణి సంపత్, దొంతరవేణి సంపత్, యామ రాములు, బత్తిని రాజు, పిట్టల మల్లేశం, బీమర్రి మురళీ, రేగుల రమేష్ లను ఎన్నుకున్నారు. అధ్యక్షులు రమేష్ మాట్లాడుతూ మండల అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు ముదిరాజ్ కులస్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముదిరాజ్ కులస్తులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు.

# బీజేపీ నాయకుల సంబరాలు..

**బలగం టీవీ, బోయినిపల్లి**



ప్రధానిగా నరేంద్ర మోడీ 3వ సారి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ కేంద్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసి విజయవంతంగా సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ బోయినిపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ నాయకత్వంలో రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ, "11 ఏళ్ల పాలనాపర్వం అనితర సాధ్యమైన విజయాలు కైవసం. 11 ఏళ్ల కాలంలో నాయకత్వం అంటే ఏమిటో దేశానికి చూపించారు. మోదీ. వాగ్దానాల్ని కార్యాచరణగా మార్చిన ప్రధాని.సంక్షేమం నుంచి సంరక్షణ వరకూ, గౌరవం నుంచి గ్లోబల్ గుర్తింపు వరకూ 11 ఏళ్ల మోదీ పాలన, భారత వైభవాన్ని విశ్వవేదికపై నిలబెట్టింది.కరీంనగర్ పార్లమెంట్ సభ్యులుగా రెండుసార్లు విజయ ఢంకా మోగించి కరీంనగర్ ప్రజల అభివృద్ధి తన ధ్యేయమని అహర్నిశలు, నిరంతరం కష్టపడుతున్న బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో పనిచేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. సాధారణ కార్పొరేటర్ పదవి స్థాయి నుండి పట్టణ ప్రధాన కార్యదర్శి అనే పార్టీ పదవి నుండి నేడు దేశ అత్యున్నత కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులుగా, బీజేపీ అగ్రనాయకత్వంలో జాతీయ ప్రధాన కార్యదర్శిగా తన సేవలు దేశ ప్రజలకు, దేశ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్న బండి సంజయ్ కుమార్, కార్యకర్తలందరికీ ఆదర్శం" అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహ చారి, మాజీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, బొంగోని అశోక్ గౌడ్, స్వామి కుమార్, కందారం వెంకటేష్, రాజూరి కిరణ్, భుత్ అధ్యక్షులు మెరుపుల గంగాధర్, గంగాధర్ చారి, సుంకపాక ప్రభు, పాలోజు రాజేంద్రప్రసాద్, జనగామ లక్ష్మణ్, ఇల్లందుల బాలయ్య, సారంపల్లి రాజు, ఐలయ్య, హనుమంతరెడ్డి, చంద్రయ్య, నవీన్, తిప్పరవేని శ్రీనివాస్, రెడ్డవేని రాజు, నాయిని నాగరాజు, బుర్ర ప్రదీప్, గడ్డమీది నరేష్, కళ్యాణం అనిల్, రేండ్ల మహేందర్, చిలుముల రమేష్ , సావన్పల్లి మధు, శ్రావణపల్లి అనిల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# ఇది నాకు పెద్ద బాధ్యత

- టీమిండియా టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత టెస్ట్ క్రికెట్ జట్టు కొత్త కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఇంగ్లాండ్‌లో తొలి ఫోటోషూట్ ద్వారా గిల్ తన కొత్త పాత్రను ప్రారంభించారు. టెస్ట్ క్రికెట్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వంటి దిగ్గజాల పదవీవిరమణ నేపథ్యంలో, భారత జట్టు ఇప్పుడు తరం మార్పు దశలోకి ప్రవేశించింది. ఈ సమయంలో 25 ఏళ్ల గిల్ నాయకత్వ బాధ్యతలు చేపట్టడం ప్రత్యేకత కలిగిన విషయం. భారత క్రికెట్ నియంత్రణ మండలి గిల్ కొత్త పాత్రను సోషల్ మీడియాలో "ఫోక్స్ ౧ యోర్ టెస్ట్ క్యాప్టెన్, శుభ్‌మన్ గిల్" అనే శీర్షికతో గిల్ ఫోటోలను పంచుకుంది. గత వారం ఇంగ్లాండ్‌కు వచ్చిన గిల్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, అర్షదీప్ సింగ్ లాంటి వేగవంతమైన బౌలర్లను ఎదుర్కొంటూ తాను తన టెక్నిక్‌ను మెరుగుపరుస్తూ, నాయకత్వ గుణాలను పదిలం చేసుకుంటున్నారు. అర్షదీప్ గిల్‌పై మాట్లాడుతూ, "గిల్ మంచి ఫామ్‌లో ఉన్నాడు" అన్నారు. ఇది శుభసూచకం అని భావిస్తున్నారు.

బీసీసీఐ విడుదల చేసిన వీడియోలో గిల్ మాట్లాడుతూ: "చిన్నప్పటినుంచి క్రికెట్ ఆడే ప్రతి ఒక్కరికీ భారత్ తరపున ఆడాలని, ముఖ్యంగా టెస్ట్ క్రికెట్‌లో తనకంటూ స్థానం ఏర్పరచుకోవాలనే కోరిక ఉంటుంది. ఇప్పుడు ఈ అవకాశం రావడం ఎంతో గౌరవంగా ఉంది. ఇది పెద్ద బాధ్యత," అని వ్యాఖ్యానించారు. ఈ నెల 20న ప్రారంభమయ్యే ఐదు టెస్టుల సిరీస్‌లో తొలి మ్యాచ్ లీడ్స్‌లోని హెడింగ్లీ మైదానంలో జరగనుంది. మిగిలిన మ్యాచ్‌లు ఎడ్జ్‌బాస్టన్, లార్డ్స్, ది ఓవల్, ఓల్డ్ ట్రాఫర్డ్ మైదానాల్లో నిర్వహించబడనున్నాయి. ఈ సిరీస్ 2025 ఆగస్టు వరకు కొనసాగుతుంది. అనుభవజ్ఞులైన రోహిత్, విరాట్ లేకుండా గిల్ నాయకత్వంలో యువ భారత జట్టు ఈ కఠినమైన విదేశీ సవాలును ఎదుర్కొనబోతోంది.

# తొలి రోజు పేసర్లదే హవా..

- తొలి ఇన్నింగ్స్‌లో 212 పరుగులకే కుప్పకూలిన ఆస్ట్రేలియా
- అనంతరం 43 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికా
- దుమ్మురేపిన రబాడా, స్టార్క్
- ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్




**బలగం టీవి, లండన్**

లార్డ్స్ మైదానంలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరుగుతున్న ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్ మొదటి రోజే ఆసక్తికరంగామారింది. టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్న సౌతాఫ్రికా జట్టు ఆస్ట్రేలియా జట్టును కేవలం 212 పరుగులకే ఆలౌట్ చేసింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన సౌతాఫ్రికా మొదటి రోజు ముగిసే సరికి 43 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

టాస్ గెలిచిన ప్రోటియాస్ కెప్టెన్ టెంబా బవుమా, పేసర్లకు అనుకూలంగా ఉన్న పిచ్‌లో బౌలింగ్ ఎంచుకున్నారు. దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబాడా (5/51) జట్టుకు అద్భుత ఆరంభాన్ని అందించాడు. రబాడా తోడుగా మార్కో జాన్సన్ (3/49) జత కట్టి విరుచుకుపడ్డారు. కేశవ్ మహరాజ్, ఐడెన్ మార్క్రమ్ తలో వికెట్ తీశారు. టీ విరామం తర్వాత కేవలం 6.4 ఓవర్ల వ్యవధిలో ఆసీస్ 5 వికెట్లు కోల్పోయింది. రెండో సెషన్‌లో కొంతవరకు పుంజుకున్న ఆసీస్, మళ్లీ తుది సెషన్‌లో ఒత్తిడికి లోనైంది. అయితే స్టీవ్ స్మిత్ తన 42వ టెస్ట్ హాఫ్ సెంచరీ (66 పరుగులు, 112 బంతుల్లో) నమోదు చేశాడు. కానీ ఐడెన్ మార్క్రమ్ బౌలింగ్‌కు మార్కో జాన్సన్ ఫస్ట్ స్లిప్‌లో అద్భుత క్యాచ్ పట్టడంతో అతను వెనుదిరిగాడు. దీంతో పాటు వెబ్బర్ సైతం అర్ధశతకం పూర్తి చేసి, స్కోర్‌బోర్డ్‌ను ముందుకు నడిపించాడు. జాన్సన్, రబాడా బౌలింగ్‌కు మొదట తడబడినా, వారు బౌలింగ్ నుంచి దిగిన తర్వాత వెబ్బర్ క్రీజులో స్థిరపడి పోయాడు. మూడో సెషన్‌లో 5వికెట్ల నష్టానికి 190 పరుగులతో పటిష్ఠంగా ఉన్న ఆసీస్ జట్టు 22 పరుగులకే చివరి ఐదు వికెట్లు కోల్పోయింది. బ్యూ వెబ్‌స్టర్ (72; 92 బంతుల్లో 11 ఫోర్లు), స్టీవ్ స్మిత్ (66; 112 బంతుల్లో 10 ఫోర్లు) అర్ధ శతకాలు చేశారు. మిగతా బ్యాటర్లు భారీ స్కోర్లు చేయలేకపోయారు. చివరికి 212 పరుగులకే ఆలౌటయ్యారు.

అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా జట్టు 22 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 43 పరుగులు చేసింది. మార్క్రమ్(0), రికెల్టన్(16), ముల్డర్(6), స్టబ్స్(2) స్వల్ప స్కోర్‌లకే పెవీలియన్‌కు చేరారు. ఆసీస్ బౌలర్లు స్టార్క్‌కు రెండు, హజిల్‌వుడ్ కమిన్స్‌కు చెరో వికెట్ దక్కాయి. స్టార్క్ తన మొదటి ఓవర్‌లోనే ఐడెన్ మార్క్రమ్‌ను పెవిలియన్‌కు పంపించాడు. ఆ తర్వాత రయాన్ రికెల్టన్‌ను కూడా అవుట్ చేసి దక్షిణాఫ్రికాను తీవ్ర ఒత్తిడిలోకి నెట్టాడు. తొలి 10 ఓవర్లలో సఫారీలు కేవలం 19 పరుగులే చేయగలిగారు. ఆసీస్ ముందు దక్షిణాఫ్రికా ఇంకా 169 పరుగుల వెనుకబడి ఉంది.

# గాయని మంగ్లీపై కేసు నమోదు

- సింగర్ మంగ్లీ పుట్టిన రోజు వేడుకలపై పోలీసుల ఆకస్మిక దాడులు
- టెస్టుల్లో ఒకరికి గంజాయి పాజిటీవ్
- మరికొందరి పైనా కేసు
- చేవెళ్లలోని త్రిపుర రిసార్టులో జరిగిన పార్టీ



**బలగం టీవి, హైదరాబాద్**

ప్రముఖ తెలంగాణ ఫోక్ సింగర్ మంగ్లీ చిక్కుల్లో పడింది. వివరాల్లోకెళ్తే.. హైదరాబాద్ నగర శివార్లలోని చేవెళ్ల సమీపంలోని ఈర్లపల్లిలోని త్రిపుర రిసార్ట్‌లో అర్ధరాత్రి దాదాపు ఒంటి గంట సమయంలో రిసార్ట్ నుంచి పెద్ద పెట్టున శబ్దాలు వస్తున్నాయని, డీజేతో హోరెత్తిస్తున్నారని స్థానికులు పోలీసు కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పోలీసులు, ఒక మహిళా ఎస్పై నేతృత్వంలోని బృందంతో కలిసి త్రిపుర రిసార్ట్‌కు చేరుకు న్నారు. సుమారు 10 మంది మహిళలు, 12 మంది పురుషులు డీజే సంగీతానికి అనుగుణంగా ఉత్సాహంగా గడుపుతున్న దృశ్యం పోలీసులకు కనిపించింది. రిసార్ట్ మేనేజర్‌ను విచారించగా, అది సింగర్ మంగ్లీ పుట్టినరోజు వేడుక అని, ఆ కార్యక్రమాన్ని తామే నిర్వహిస్తున్నామని తెలిపారు. అయితే, ఈ కార్యక్రమానికి ఎలాంటి అధికారిక అనుమతులు తీసుకోలేదని ఆయన పోలీసులకు వివరించినట్టు తెలిసింది. పోలీసులతో అనుమానంతో డ్రగ్ కిట్లతో అందరికీ టెస్టులు చేయగా ఒకరికి(దామోదర్) గంజాయి పాజిటివ్‌గా వచ్చింది. దీంతో అతడిపై ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు పోలీసులు. అలాగే పార్టీ జరుగుతున్న ప్రదేశంలో పెద్ద మొత్తంలో మద్యం బాటిళ్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మద్యానికి కూడా ఎటువంటి అనుమతులు లేవని తేలిసింది. ఈ సందర్భంగా గాయని మంగ్లీని ప్రశ్నించగా, పార్టీ నిర్వహణకు, మద్యం వినియోగానికి, డీజే ఏర్పాటుకు అవసరమైన అనుమతులు తీసుకోలేదని ఆమె అంగీకరించినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో, అనుమతులు లేకుండా కార్యక్రమం నిర్వహించడం, అక్రమంగా మద్యం కలిగి ఉండటం, గంజాయి వినియోగం వంటి ఆరోపణలపై గాయని మంగ్లీ, రిసార్ట్ అసిస్టెంట్ మేనేజర్ రామకృష్ణ, ఈవెంట్ మేనేజర్ మేఘరాజ్, దామోదర్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇక ఈ పార్టీకి చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు సెలెబ్రిటీలు కూడా వెళ్లారు. దివి, కాసర్ల శ్యామ్, రచ్చ రవి, సింగర్ ఇంద్రావతి పాల్గొన్నారు.

ఇక ఈ పార్టీలో పాల్గొన్నారంటూ వచ్చిన వార్తలపై యువ తార, బిగ్‌బాస్ ఫేమ్ దివి వాద్యా మీడియాకు తన వాయిస్ నోట్‌ను పంపించి వివరణ ఇచ్చారు. పార్టీకి తాను వెళ్లాను కానీ.. అక్కడ ఏం జరిగిందో తనకు తెలియదు అని చెప్పారు. "మీడియాకు నా చిన్న రిక్వెస్ట్. ఎవరైనా బర్త్ డే పార్టీకి పిలిస్తే వెళ్లడం సహజం. కానీ అక్కడ ఏం జరుగుతుందో మనకు ఏం తెలుసు. వాళ్లకు సంబంధించిన తప్పులను మనపై తోయడం సరికాదు. నా గురించి మీరు కూడా నిర్ధారించుకొండి. నా తప్పు ఉంటే నా గురించి రాయండి. నా ఫోటో వేయండి. ఎలాంటి తప్పు లేకున్నా నా ఫోటో యూజ్ చేసి నా గురించి తప్పుగా రాస్తే ఎలా ఉంటుంది. నా కెరీర్‌కు ఎంత ఇబ్బందిగా ఉంటుందో తెలుసా? నేను ఎంత కష్టపడితే ఈ స్థాయికి వచ్చి ఉంటానో మీకు తెలుసు కదా" అని దివి వద్యా అన్నారు. అలాగే తాను వెళ్లాను కానీ.. ఆ పార్టీలో తాను లేనని సినీ గేయ రచయిత కాసర్ల శ్యామ్ వివరణ ఇచ్చారు.

# తమ్ముడు ట్రైలర్ విడుదల..

**బలగం టీవి, హైదరాబాద్**




నితిన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం తమ్ముడు. దర్శకుడు శ్రీరామ్ వేణు ఈ మూవీని డైరెక్ట్ చేస్తుండడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. తాజాగా ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. 'మీ అక్కను చూశావా?. తను చనిపోవడానికి రెడీగా ఉంది కానీ, క్యారక్టర్ ను మాత్రం లూజ్ అవ్వలేదు' అనే డైలాగ్ తో ఈ ట్రైలర్ ప్రారంభం అయింది. "చేసిన తప్పు వల్ల ఆవిడ ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయింది. ఇప్పుడు ఆ మాట నిలబెట్టే ఛాన్స్ వచ్చింది" అంటూ నితిన్ చెప్పిన డైలాగ్‌ని బట్టి చూస్తుంటే, తన అక్క మాటని నిలబెట్టే తమ్ముడి కథ ఇదని తెలుస్తోంది. నితిన్ అక్క పాత్రలో లయ కనిపించారు. ఈ సినిమాలో వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ, లయ, సౌరబ్ సచ్‌దేవ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తుండగా దిల్ రాజు, శిరీష్ ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఈ సినిమాను జూలై 4న విడుదల కానుంది.

# ప్రముఖ దర్శకుడు ఏఎస్ రవికుమార్ కన్నుమూత

**బలగం టీవి, హైదరాబాద్**



ప్రముఖ దర్శకుడు ఏఎస్ రవికుమార్ మృతి చెందారు. మంగళవారం రాత్రి గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. గతేడాది చివరగా రాజ్ తరుణ్‌తో 'తిరగబడరా సామీ' అనే మూవీ చేశారు ఆయన. ఆయన మృతికి టాలీవుడ్ ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు. గోపీచంద్ హీరోగా నటించిన 'యజ్ఞం' సినిమాతో దర్శకుడిగా కెరీర్ మొదలుపెట్టిన ఏఎస్ రవికుమార్ చౌదరి.. బాలకృష్ణతో 'వీరభద్ర', సాయి ధరమ్ తేజ్‌తో 'పిల్లా నువ్వు లేని జీవితం'తో పాటు ఆటాడిస్తా, ఏం పిల్లో ఏం పిల్లడో, 'సౌఖ్యం' తదితర చిత్రాలు తీశారు. ఆయన చేసిన చివరి సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాలను అందుకోలేకపోవడంతో రవికుమార్ మానసికంగా ఒత్తిడికి లోనయ్యారని పలువురు అంటున్నారు.

**పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. శ్రీలీల కథానాయికగా నటిస్తుండగా, రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్నారు. తాజాగా మైత్రి మూవీ మేకర్స్ ఓ వీడియో విడుదల చేస్తూ పవన్ కళ్యాణ్ సెట్‌లో అడుగుపెట్టినట్టు తెలియజేశారు. ఇందులో పవన్ కళ్యాణ్ చాలా స్టైలిష్‌గా కనిపించడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. జూన్ 10 నుండి షూట్ మొదలు కాగా బుధవారం పవన్ జాయిన్ అయినట్టు తెలుస్తుంది. తాజాగా ప్రారంభమైన ఈ సినిమా తొలి షెడ్యూల్ సుమారు 30 రోజుల పాటు నాన్‌స్టాప్‌గా జరగనుంది.**